క్లుప్తంగా

పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వద్దు : డీఆర్డీఓ జ్యోతి


కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ జ్యోతి

నారాయణఖేడ్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించొద్దని డీఆర్డీఓ జ్యోతి సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పంచగామను మంగళవారం ఆమె సందర్శించారు. గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలకు రోజుకు రూ.300 చొప్పున వచ్చేలా పనులకు మార్కింగ్ ఇచ్చి కచ్చితంగా పనులు చేయించి కూలీ అందేలా చూడాలన్నారు. కూలీలు తగ్గకుండా, పనులు ఆపకుండా కొనసాగించేలా చూడాలని ఏపీఓ మాణిక్‌రావుతోపాటు టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కూలీలు ఆమెకు మొక్కను బహూకరించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

గణితం విజయానికి మెట్టు

పటాన్‌చెరు: గణితంపై పట్టు విజయానికి తొలి మెట్టుగా గీతం విద్యార్థులు అభివర్ణించారు. మంగళవారం రుద్రారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, సైన్స్ ప్రాముఖ్యతను వివరించడానికి ఉద్దేశించిన ఔట్రీచ్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొని గణితం, సైన్స్‌పై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాశం నరసింహస్వామి మాట్లాడుతూ ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించడంలో గణిత శాస్త్రం పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో రుద్రారం ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చురుకుగా రోడ్డు నిర్మాణ పనులు


నిర్మాణంలో ఉన్న రోడ్డు

రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్ నుంచి రాయికోడ్ వరకు నిర్మిస్తున్న మెటల్ రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నారు. ఎర్రమట్టి, కంకర వేసి చదునుచేసే పనులు పూర్తయ్యాయి. వారం రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. దీంతో రైతులు, ప్రయాణికుల ఇబ్బందులు తొలగనున్నాయి. రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉగాది నిర్వహణపై సమావేశం


అర్చకులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: ఉగాది పండుగ నిర్వహణపై చైతన్యనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలతో చర్చించారు. ఏప్రిల్ 9న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని పసల్వాది గ్రామ శివారులోని రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మృతదేహం లభ్యమైందని, వయసు సుమారు 45 సంవత్సరాల ఉంటుందని ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిసినవారు 8712656719కు సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- పేర్‌ఖాన్‌పల్లి అటవీ ప్రాంతంలో కొలువుదీరిన పలుగు పోచమ్మ
- నేటి నుంచి 7వరకు ఉత్సవాలు


ఆలయంలో కొలువుదిరిగిన అమ్మవారు


పలుగు మీది నల్ల పోచమ్మ ఆలయం

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధి షేర్‌ఖాన్‌పల్లి గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో వెలిసిన పలుగుమీది నల్లపోచమ్మ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 3 నుంచి 7 వరకు జరిగే ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 3న అమ్మవారికి పూజా కార్యక్రమాలు, 4న అగ్నిగుండాలు, బోనాలు, 5న ఎల్లమ్మ దేవి కళ్యాణం,6న బండ్ల ఊరేగింపు,7న ప్రత్యేక పూజలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు జిల్లా నుంచి కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

- అవిశ్వాస సమావేశం నిర్వహించిన ఆర్డీఓ
- హాజరు కాని బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీటీసీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్డీఓ వసంతకుమారి ఆధ్వర్యంలో మంగళవారం జిన్నారంలోని ఎంపీపీ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ వసంత కుమారితోపాటు తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీఓ అరుణ హాజరయ్యారు. కాని బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. సమావేశానికి బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు చెందిన ఎంపీటీసీలు హాజరుకాక పోవడంతో అవిశ్వాసం వీగినట్లు ఆర్డీఓ వసంతకుమారి ప్రకటించారు. సీఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎంపీపీగా రవీందర్‌గౌడ్ కొనసాగుతుండంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

సైబర్‌వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- 12.92 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.12.92 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు 28 ఫిబ్రవరి మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.5వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.12.92లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్ లో నగదు తో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదు తో పాటు కమిషన్ ఇవ్వాలని అడగ్గా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా క్యాబ్ బుక్ చేసే క్రమంలో ఓ వ్యక్తి సైబర్ వలలో పడి రూ.2.36 లక్షల పోగొట్టుకున్నాడు. అలాగే మరో వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి రూ.69 వేలు పోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

నీలం మధుకు సంపూర్ణ సహకారం

మాజీ జెడ్పీటీసీ జైపాల్


జైపాల్‌ను సన్మానిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ జెడ్పీటీసీ జైపాల్ స్పష్టం చేశారు. మంగళవారం మధు జైపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం మండలంలోని పాటి గ్రామంలో మాజీ సర్పంచ్ రాములు యాదవ్, ఎంపీటీసీ గోపాల్ యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కౌన్సిలర్ కొల్లారు మల్లేష్, ప్రతాప్ కృష్ణ, మైనార్టీ నాయకులు మతీన్, జనార్దన్ రెడ్డి, శ్రీకాకుళం అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిసి మద్దతు కోరారు.

200 పనిదినాలు కల్పించాలని డిమాండ్


కూలీలతో మాట్లాడుతుతన్న నర్సింహులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 పని దినాలు కల్పించి రూ.800 దినసరి కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. మంగళవారం రేజింతల్ గ్రామంలో పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కూలీలకు రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి బకాయిలు వెంటనే ఇవ్వకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుచ్చయ్య, మల్లేశం, యేసయ్య, రాజు, అమృతమ్మ, రాములు, యేసమ్మ, సమీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు రూ.లక్ష సాయం

సంగారెడ్డి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంతోషి నాగరాజు దంపతులకు అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి ప్రతినిధులు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం సేవా సమితి ఉపాధ్యక్షుడు జనప్రియ రాజు గురుస్వామి మాట్లాడుతూ పూజలతో పాటు సేవా కార్యక్రమాలకు కోసం సేవా సమితిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణ, జయప్రకాశ్, సాహితీ రాము, మాణిక్య రెడ్డి, శ్రీకాంత్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ముత్తంగి స్వీట్ హార్ట్ హోటల్ వెనుక 60ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం మృతుడి బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులు కలిసి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

డీఆర్‌ఓ ఎమ్మెల్యేల వినతి


వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

సంగారెడ్డి టౌన్: పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, ప్రతి క్వింటాల్‌కు 500బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి డీఆర్‌ఓ పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంట నష్టం అందించాలని, రైతుల కష్టాలను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు నెరవేర్చడం లేదని వాపోయారు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలని, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివ కుమార్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ భాస్కర్

సంగారెడ్డి: ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహించే వారికి సీఐ ఎస్.భాస్కర్ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సామాన్య ప్రజానీకానికి, వాహనదారులకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని, తద్వారా రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తుందని ఆయన అన్నారు. వాహనాలు రోడ్లపై ఉంచకుండా చూసుకోవాలసిన బాధ్యత దుకాణదారులదేనన్నారు.

38వార్డులకు ఉచిత తాగునీటి సరఫరా


ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న వాసవీ సభ్యులు

సంగారెడ్డి: పట్టణంలోని 38వార్డులకు ఉచిత తాగునీటి సరఫరాకు వాసవీ మాఇల్లు సేవాసంస్థ శ్రీకారం చుట్టింది. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి మంగళవారం తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ మాట్లాడుతూ 100 రోజులపాటు పట్టణంలోని 38వార్డులలో ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాశ్, కృష్ణమూర్తి, విద్యాసాగర్, శ్రీనివాస్, శ్రీధర్, విట్టల్ దాస్, మహేందర్, ప్రసాద్, నరేష్ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు దహనం చేసిన దుండగులు


దుండగులు దహనం చేసిన ట్రాక్టర్లు

కంగ్టి(నారాయణఖేడ్): ఒకేచోట నిలిపి ఉంచిన మూడు ట్రాక్టర్‌లను గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. కంగ్టి మండలం ఒల్గూర్ శివారులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకొంది. దామర్‌గిద్దా కాకివాగు ప్రాజెక్టులో మట్టి తరలిస్తూ రాత్రివేళ శివారులో ట్రాక్టర్లను ఉంచుతున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇమ్మిడిశెట్టి పండరికి చెందిన 2జాన్‌డీర్ ట్రాక్టర్లు, హన్మంత్‌రావుకు చెందిన ఒక జాన్‌డీర్ ట్రాక్టర్‌కు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సిర్గాపూర్ మండలం నల్లవాగులో గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బంది హాజరు శాతం పరిశీలించి భోజన వసతి గురించి ఆరా తీశారు. కాంట్రాక్టర్ నాసిరకం కూరగాయలు సరఫరా చేస్తే తీసుకోవద్దని కేర్‌టేకర్‌ను ఆదేశించారు. వాటర్ ట్యాంక్ కూలడానికి సిద్ధంగా ఉందని సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన గురుకులంలో చేపట్టాల్సిన పనుల గురించి నివేదిస్తే పరిష్కరిస్తాననని భరోసా ఇచ్చారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, సేవాలాల్ సంఘం అధ్యక్షుడులు రమేశ్ చౌహన్, నాయకులు గోవింద్ నాయక్, జయరాజ్ ఉన్నారు.

సర్వాయి పాపన్నకు నేతల నివాళి


నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

నారాయణఖేడ్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్‌తోపాటు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, జిల్లా, స్థానిక బాధ్యులు నర్సింహాగౌడ్, రాంచందర్ గౌడ్, బాలాగౌడ్, శంకర్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు భూమాగౌడ్, సాయాగౌడ్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా సమన్వయకర్త నరేందర్, అంబేడ్కర్ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఆయన స్ఫూర్తితో కొనసాగాలి..

జహీరాబాద్ టౌన్: జై గౌడ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస్ మహల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నేతలు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మానయ్యగౌడ్, మాణిక్‌ప్రభు గౌడ్, అంజయ్యగౌడ్, విఠల్ గౌడ్, రంగయ్య గౌడ్, లక్ష్మణ్ గౌడ్, దత్తు గౌడ్, రాజు గౌడ్, తుల్జరాం, శ్రీనివాస్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

ముందుకు సాగుదాం..

సంగారెడ్డి టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదామని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్ అన్నారు. సంగారెడ్డిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలబంధు ఆశ్రమంలో పిల్లలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజ్ గౌడ్, నాయకులు రమేశ్, జంగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు..

కొండాపూర్(సంగారెడ్డి): గొల్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి మొఘుల్ సైన్యాలపై పోరాడారన్నారు. పెత్తందారుల గుండెల్లో నిద్రించిన గెరిల్లా యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో బాలాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, అనంతయ్య గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారం అవసరం

డీఎస్పీ వెంకట్‌రెడ్డి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నారాయణఖేడ్‌లో ఆయన ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. రెండు కంపెనీల బీఎస్ఎఫ్ బలగాలతో మంగల్‌పేట్‌లోని మా ఫంక్షన్ హాల్ నుంచి పొట్టి శ్రీరాములు చౌక్, రాజీవ్ చౌక్, బసవేశ్వర చౌక్, శివాజీచౌక్‌ల మీదుగా కవాతు సాగింది. ఏఆర్ డీఎస్పీ నరేందర్, సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన వీరభద్రుడు


హంస వాహనంపై ఊరేగుతున్న వీరభద్రుడు

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి హంసవాహనంపై వీరభద్రుడిని ఘనంగా ఊరేగించారు. ఈఓ శశిధర్, ఆలయ పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమలు కాని మెనూ

కొండాపూర్(సంగారెడ్డి): నాసిరకం ఆహారం వడ్డిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెనూ ప్రకారం మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులకు బీట్‌రూట్, క్యారెట్‌లతో కూడిన కర్రీ, టమాట పప్పు, రసం, పెరుగుతో పాటు చట్నీ వడ్డించాల్సి ఉంది. కానీ నాసిరకం వంట చేయడంతో విద్యార్థులు ఆ ఆహారాన్ని పారబోశారు. సమయానికి కూరగాయలు రాకపోవడంతో మెనూ పాటించలేకపోయామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెప్పారు.